




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 9వ భాగం

ప్రస్తుతం మనం 1868 వ సంవత్సరం లండన్ లో వున్నాం. 'కేపిటల్' విడుదలయ్యి అప్పటికి 4 నెలలు అవుతోంది. ఎంగెల్సు కావాలని రాసిన పుస్తక పరిచయాలు తప్ప,ఈ 'కేపిటల్' పుస్తకం గురించి ఎవ్వరూ, ఎక్కడా ప్రస్తావించలేదు. 1868 జనవరి మధ్యలో లండన్ నుండి వచ్చే "సాటర్ డే" అనే పత్రిక ఒక చిన్న వార్త, అది కూడా కొద్ది పంక్తులు మాత్రమే రాసింది. సహజం గానే మార్క్సు లో అసహనం, అసంతృప్తీ, నిరాశా, నిర్వేదం రోజురోజుకి పెరిగిపోయి, అవి ఆయన ఆరోగ్యం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపించాయి. ఆయన ఎప్పుడు మానసిక ఒత్తిడికి లోనయినా, ఒంటి మీద చిన్న చిన్న కురుపులు మొదలయి, అవి పెరిగి పెద్దవయి, ఒళ్ళంతా పెద్ద పెద్ద గాయలుగా అవడం అనేది జరుగుతుండేది. 'ఈ పుస్తకం ఎవరూ చదవడం లేదు. ఎవరూ పట్టించు కోవడం లేదు.' అన్న భావం లోలోపల ఉంటున్న ఇప్పుడు కూడా అదే జరిగింది. ఒళ్ళంతా పుళ్ళు రావడంతో నిద్రా, విశ్రాంతీ సరిగ్గా ఉండేవి కావు.

పబ్లిషర్ మాత్రం ఫరవాలేదు. "మొదటి వాల్యూం ఎలాగో వెళుతోంది. మీరు రెండో వాల్యూం రాయడం కొనసాగించండి." అని కబురు పంపించారు. నెమ్మది నెమ్మదిగా ఈ నిరాశ నుండి బయటకు వస్తూ, "బ్రిటీష్ లైబ్రరీ" వెళ్ళి,

లేని ఉత్సాహాన్ని తెచ్చుకుని సమాచార సేకరణలో పడ్డాడు. రాత పని ఎలా ఉన్నప్పటికీ...మార్క్స్ మరో సంస్థలో చురుకుగా ఉండేవాడని గతంలో అనుకున్నాం కదా! అది i. w.m.a. ఆ సంస్థ రాజకీయాలూ, యూరప్ రాజకీయాలూ మార్క్స్ ని తీరిక లేకుండా చేశాయి.ఇలా జరుగుతుండగా, ఆయన వ్యక్తి గత జీవితం గురించి తెలుసుకుందాం.

1868 మార్చిలో మార్క్స్ రెండో అమ్మాయి లారా, పాల్ లు ఇద్దరూ "మేం పెళ్ళికి సిద్దంగా వున్నాం." అన్నారు. అప్పటికి నిశ్చితార్ధం అయ్యి, సంవత్సరంన్నర అయ్యింది. ఈ పాల్, పారిస్ లో బహిష్కరించిన తర్వాత లండన్ వచ్చి, సంవత్సరం అయింది. చదువు కూడా పూర్తి కావస్తోంది. గతంలో నిశ్చితార్ధం అయినప్పుడు పెళ్లి 2 సంవత్సరాల తర్వాత అనుకున్నారు గానీ, ఇప్పుడు పరిస్థితి ఆలోచిస్తే, పెద్దగా ఆగాల్సిన అవసరం ఏమీ కనిపించడం లేదు. సరేనని, పెళ్లి ప్రయత్నాలు ప్రారంభిచారు మార్క్స్ దంపతులు. మొట్ట మొదట వాళ్లకి వచ్చిన ఆలోచన పెళ్లి ఎక్కడ చెయ్యాలి? అని. ఈ పాల్ ఫ్రాన్సు నుండి వచ్చారు. ఆయన అమ్మా, నాన్నా, ఇతర కుటుంబ సభ్యులందరూ ఫ్రాన్సు లోనే వున్నారు. అయితే, ఫ్రాన్సు వెళ్ళడానికి మార్క్స్ కి పాస్ పోర్ట్ లేదు. గతంలో ఆయన్ని ఫ్రాన్సు నుండి బహిష్కరించినపుడు, ఆయన మీద విధించిన నిబంధనలు అలాగే వున్నాయి. కాబట్టి మార్క్స్ పారిస్ వెళ్ళలేదు.

పెళ్లి లండన్ లోనే చేద్దాం అనుకున్నారు. పాల్ కుటుంబ సభ్యులు కూడా "సరే! అలాగే కానివ్వండి"అన్నారు. తరువాత సమస్య డబ్బులు. మార్క్సుకు నిత్య పేదరికమే కదా! వీళ్ళ సంగతి తెలిసిన ఒక డాక్టర్ మిత్రుడు 15 పౌండ్లు పంపించాడు. ఎంగెల్సు ఎలాగూ వున్నాడు కదా! ఆయన ఒక 4o పౌండ్లు పంపించాడు. మొత్తం 55 పౌండ్లు తోటి ఏ ఇబ్బంది లేకుండా పెళ్లి జరిపించవచ్చు.1868 ఏప్రెల్ 2 తారీఖున పెళ్లి. మార్క్స్ ఆరోగ్యం ఏ మాత్రం మెరుగుపడలేదు. రక్తం కారుతున్న పుళ్ళకి డ్రెసింగ్ చేసుకున్నాడు. వదలకుండా పీడిస్తున్న తలనొప్పి, చాతీనొప్పి అవి ఎలాగూ వున్నాయి. వాటిని అదుపులో పెట్టుకుంటూ, పాత కోటు వేసుకొని పెళ్లి కూతురు తండ్రిగా రిజిస్టార్ ఆఫీసుకి వెళ్ళాడు. ఎంగెల్సూ, మరికొద్ది మంది మిత్రులు మాత్రమే వచ్చారు. "సెంట్ పాట్రాస్ రిజిస్టార్ ఆఫీస్ లో పాల్, లారా లకు వివాహం నమోదయ్యింది. పెళ్లి జరిగిన రెండు, మూడు నెలల్లోనే పాల్ చదువుతున్న మెడికల్ కోర్సులు పూర్తయ్యాయి లండన్ లో .

పారిస్ లో మిగతా కోర్సులు పూర్తిచెయ్యలన్నది పాల్ ప్రణాళిక. అసలు ఈ ఒప్పందం మీదే తన పెద్దవాళ్ళు లండన్ పంపించారు. కానీ, లండన్ లో ఇలా జరిగింది. తిరిగి పారిస్ వెళ్లి మెడికల్ కాలేజి లో కోర్సులు పూర్తి చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. అయితే, వాళ్ళు ఏం చెప్పారంటే, " 2 ఏళ్ళు నీ మీద నిషేధం విధించాం కాబట్టి, మళ్ళీ నిన్ను చేర్చుకోవడానికి, కొన్ని అనుమతులు కావాలి. అందుకని కొన్ని నెలలు ఆగాల్సి వుంటుంది."అని. క్రమ క్రమంగా పాల్ కి చదువు మీద ఆసక్తి తగ్గిపోయి, రాజకీయాల్లో ఎక్కువగా పాల్గొంటుండేవాడు. మార్క్స్ ఉత్తరాలు రాస్తుండేవాడు."పాల్ ! నువ్వు డాక్టరువయ్యి, మా అమ్మాయిని చూసుకుంటావని అనుకున్నాము. నువ్వేమో రాజకీయాలకి అంకితం అవుదామని అనుకుంటున్నావు. అది నాకు ఇష్టం లేదు."అని. పాల్ వాళ్ళ నాన్న కూడా అదే చెప్పాడు. అయినా,

పాల్ మాత్రం తన అభిప్రాయం మార్చుకోలేదు. ఆ విధంగా డాక్టర్ అవ్వవలసిన మార్క్స్ అల్లుడు, రాజకీయాల్లో కార్యకర్తగా కొనసాగాడు.

అది అలా వుండగా, మనం లండన్ వద్దాం. మార్క్స్ ఇంట్లో నుండి పెళ్ళయి లారా వెళ్ళిపోయింది. పెద్దమ్మాయి చెన్ ఆలోచనల్లో పడింది. ఏం చేద్దామనుకొన్నాను? ఏం చేస్తున్నాను? చెల్లెలేమో పెళ్లి చేసుకొని వెళ్ళిపోయింది. ఎన్నాళ్ళు తల్లి తండ్రికి భారంగా వుండాలి. జెన్ని చెన్ అసలు మొదట్లో 'స్టేజ్ యాక్టర్' కావాలని వుండేది.ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆ తరువాత నాటకాలు రాద్దామని అనుకుంది. అదీ కుదరలేదు. రకరకాల ఆలోచనలతో చివరకు ఒక నిర్ణయానికి వచ్చింది. వాళ్ళ ఇంటికి దగ్గరలోనే ఒక 'స్కాటిష్' కుటుంబం వుంది. వాళ్ళ పిల్లలకి రోజంతా వుండి ట్యూషన్లు చెప్పడానికి ఒక వుద్యోగం చూసుకుంది.

ఈ విధంగా రెండో అమ్మాయి లారా పెళ్ళిచేసుకొని వెళ్ళిపోయింది. పెద్దమ్మాయి రోజంతా ఆ స్కాటిష్ వాళ్ళ ఇంటిలోనే వుండి రాత్రుళ్ళు వస్తోంది. ఇద్దరు పిల్లలూ ఇంట్లో లేకపోయేసరికి మార్క్స్ ఇల్లంతా బోసిపోయినట్లయింది. ఆ విధంగా 1868 గడుస్తోంది. 1868 నవంబర్ ప్రాంతంలో మార్క్సుకి రష్యా నుండి ఒక వుత్తరం వచ్చింది. "సెంట్ పీటర్ బర్గ్ "లో ఆర్ధికశాస్త్ర ఆచార్యుడిగా పనిచేస్తు "నికోలాయ్"ఆ వుత్తరం రాశాడు.

" ఇక్కడ[అంటే రష్యాలో] స్థానికంగా ఒక పబ్లిషర్ వున్నాడు. ఆతను మీరు జర్మన్ భాషలో రాసినటువంటి 'కేపిటల్' గ్రంథాన్ని రష్యన్ భాషలో ప్రచురిద్దామని చూస్తున్నాడు. నేనూ, మరొక ఇద్దరూ అసిస్టెంట్లు కలసి అనువాదం చేస్తున్నాము. మీ అనుమతి కోసం ఈ వుత్తరం రాశాను." అని. మార్క్స్ చాలా ఆశ్చర్యపోయాడు. మొదటి నుండి రష్యా రాజకీయలన్నా, రష్యా రాజకీయ నాయకులన్నా అస్సలు పడేది కాదు. అలాంటిది ఇప్పుడు జర్మన్ లో సరిగ్గా అమ్ముడు కాని కేపిటల్ పుస్తకాన్ని రష్యన్ భాష లోకి అనువాదం చేస్తున్నారంటే, చాలా ఆశ్చర్యపోయాడు. వెంటనే అనుమతి కూడా ఇచ్చాడు.

మరొక సంఘటన ఏమిటంటే, అది ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించినది. ఎంగెల్సు మాంచెస్టర్లో ఫ్యాక్టరీ నడుపుతున్నాడు. అవసరమయి నప్పుడల్లా డబ్బులు పంపిస్తున్నాడు కదా! ఆయన ఒక వుత్తరం రాశాడు."నా ఫ్యాక్టరీ లో నా వాటా అమ్మేద్దామని అనుకుంటున్నాను.నేనూ, లిజీ [భార్య] మేం ఇద్దరమూ లండన్ వచ్చేద్దామని అనుకుంటున్నాము. నేను ఈ కంపెనీ నుండి బయటకు వచ్చేస్తే,మరి నాకు నెలనెలా ఆదాయం వుండదు.నీకు పంపించలేను. అందుకని, రాబోయే 7,8 సంవత్సరాలకి సరిపడా నీకు యెంత మొత్తం కావాలో చెబితే, నీకు అవసరమైన మొత్తమూ, మాకు అవసరమైన మొత్తమూ అంతా కలిపి లెక్కలు వేసుకొని, నా వాటాకి ఎంతకి రావాలో నా భాగస్వాములతో బేరం ఆడుకుంటాను. నీకు సంవత్సరానికి 35o పౌండ్లు సరిపోతుందా? నీకు ఇంకా ఎన్ని అప్పులు వున్నాయి? అవన్నీ కూడా తీర్చేస్తే, ఆ తరువాత నేను 3 నెలలకి ఒకసారి డబ్బులు ఇస్తాను.వాటితో మీరు సుఖంగా గడపగలరా?"

ఆ వుత్తరం చూసి మార్క్స్, జెన్నిల మనసు మూగపోయింది. 'రాబోయే కొని సంవత్సరాల వరకూ మీ సంగతి నేను చూసుకుంటాను' అంటున్నాడు కదా! ఇద్దరూ కూర్చొని లెక్కలు చూసుకున్నారు. ఇంకా తీర్చవలసిన బాకీలు 210 పౌండ్లు తేలింది. అదికూడా డాక్టర్ బిల్లులు కాకుండా, ఆయన 350 పౌండ్లు సరిపోతాయా? అంటున్నాడు. చాలా సౌకర్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు. పైగా జెన్నిచెన్ కూడా ఏదో కొంత సంపాదిస్తోంది. "ఇక పై జాగ్రత్తగా, భద్రంగా గడుపుదాం. గతంలోలాగ అటూ, ఇటూ చూడకుండా ఖర్చులు పెట్టడం లాంటి పనులు చేయకుండా, ఒక క్రమ పద్ధతిలో జీవితాన్ని గడుపుదాం" అనుకొని, ఎంగెల్సుకి ఉత్తరం రాశారు. కాస్త జీవితం మెరుగుపడే రోజులు వస్తున్నాయి అనుకున్నారు.

ఎంగెల్సు మొత్తం లెక్కలు వేసుకొని తన భాగస్వాములతో బేరం పెట్టాడు. "మీరు ఇంత ఇస్తే గనక నా వాటా ఇచ్చేస్తాను." అని. ఇదంతా ఎంగెల్సు మాంచెస్టర్ లో ఉండగానే.

1868 నుండి మొదలై మార్క్స్ మరణించేవరకు మరో 15 సంవత్సరాల పాటు పెద్దగా ఆర్థిక ఇబ్బందులేవి పడలేదు. అదంతా ఎంగెల్సు దయ అనుకోవాలి. అయితే, తర్వాత కాలంలో మార్క్స్ జెన్నిలు పేదరికాన్ని అనుభవించలేదు. కానీ, వాళ్ళ పిల్లల జీవితాల్ని చూస్తే, ఆ పేదరికాన్ని పిల్లలకు బదిలీ చేసారా అనిపిస్తుంది.

1869 మొదట్లో మరొక శుభవార్త. మార్క్స్ తాత అయ్యాడు 50ఏళ్ళకి. పారిస్ లో వున్న లారా, పాల్ లకు ఒక మగబిడ్డ పుట్టాడు. "అంతా తాత పోలికే నని అందరూ అంటున్నా" రని వుత్తరం రాసింది లారా. 1869 సంవత్సరం మధ్య కాలం వచ్చింది. ఎంగెల్సు ఫ్యాక్టరీ లో తన వాటాని అమ్మేసాడు. ఆయన వాటా కింద 12,500 పౌండ్లు వచ్చాయి. అంటే ఇప్పటి మారకంలో అయితే 20 లక్షల పౌండ్లు వచ్చాయి. 'ఆ డబ్బులు తన కుటుంబానికీ అంటే వాళ్లకి పిల్లలు లేరు కాబట్టి, ఎంగెల్సు కీ, భార్య లిజీకీ, మార్క్స్ కుటుంబానికీ రాబోయే కొన్ని సంవత్సరాలవరకూ ఏ ఇబ్బంది లేకుండా గడచి పోతాయి.' అని ఎంగెల్సు నిర్ధారణ చేసుకున్నాక, మార్క్సుకి ప్రతి 3 నెలలకీ ఒకసారి ఇవ్వడం మొదలుపెట్టాడు.

1869 లోనే జరిగిన ఇంకో పరిణామం ఏమిటంటే, మార్క్స్ పెద్దమ్మాయి చెన్, ఆమె కూడా రాజకీయ వ్యాసాలు రాసే స్థాయికి ఎదగడం. ఇప్పుడు మనం చూస్తే, మార్క్స్ రచనలతో పాటూ, జెన్నిచెన్ వ్యాసాలు కూడా కనిపిస్తాయి. ఆమె తండ్రి నీడలో కాకుండా, సొంతంగా ఎదగాదనికీ, క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించడం కూడా ఇదిగో ఈ 1869లోనే జరిగింది.అదెలా జరిగిందో క్లుప్తంగా తెలుసుకుందాం.

1869 లోనే ఇంగ్లండు ఆక్రమించి నటువంటి దేశం ఐర్లాండ్ ను రక్షించుకోవడానికి ఉద్యమం బయలుదేరింది. వాళ్ళంతా ఇంగ్లండు లో ఉన్నటువంటి ఐర్లండు దేశభక్తులు. వీళ్ళే కాకుండా ఐర్లండు నుండి కొంతమంది కార్యకర్తలు ఇంగ్లండు వచ్చి, లండన్ లోనూ, లండన్ పరిసర ప్రాంతాల్లోనూ ఆందోళనలు చేపట్టారు. కొన్నిసార్లు అవి హింసాత్మకం గానూ జరుగుతుండేవి. ఆ ఉద్యమాలను సమర్థిస్తూ చెన్ వ్యాసాలు రాయడం మొదలు పెట్టింది. అలా ఆమె రాజకీయ

రంగ ప్రవేశం జరిగినట్లయింది. పోను పోనూ ఆ సమావేశాలకు మార్క్స్ వెళ్ళకపోయినప్పటికీ, జెన్ వెళుతుండేది. నెమ్మది నెమ్మదిగా మార్క్స్ కూతురు అని కాకుండా,ఆమె ఉద్యమాలకు మద్దతు నిస్తున్న వ్యక్తిగా తమ కార్యక్రమాలకు పిలుస్తుండేవారు.

187o రాగానే మళ్ళీ ఒక విషాద వార్త. పారిస్ లో వున్న లారాకి రెండో సంతానం ఆడపిల్ల నెలలు నిండ కుండా పుట్టింది. పుట్టిన దగ్గరనుండి అనారోగ్యంతోనే వుండేది. 3 నెలలు నిండకుండానే మరణించింది. మార్క్స్, జెన్నిలకు గతంలో ఎలాగైతే పిల్లలు చనిపోయారో, ఇప్పుడు లారాకి అలాగే జరిగింది.187o జూలైలో ఎంగెల్స్ తన మకాం మాంచెస్టర్ నుండి లండన్ కి మార్చాడు. మార్క్స్ ఇంటికి దగ్గర్లోనే కేవలం పది నిముషాల దూరంలో “122, రీజెంట్ పార్క్ “ ఇంటిని అద్దెకు మాట్లాడింది జెన్ని. దాదాపు 2o సంవత్సరాల తర్వాత మార్క్స్, ఎంగెల్స్ లు పక్కపక్కనే వుండే అవకాశం వచ్చింది. ఆనాడు లండన్ కి మకాం మార్చిన ఎంగెల్స్, తరువాత మార్క్స్ మరణించేవరకు, ఆ తరువాత కూడా అక్కడే నివసించాడు.

ఇప్పుడు మనం 187o మధ్యలో వున్నాం. మొత్తం జీవితంలో ఎక్కడో ఏదో జరుగుతుంది. మనకు ఏమీ సంబంధం లేదు అనుకుంటాం.కానీ, ఆ సంఘటన ప్రభావం మనజీవితం మీద కూడా పడుతుంది. ఇప్పుడు మార్క్స్ కి కూడా అదే జరిగింది. లండన్ బయట పక్క దేశంలో తలెత్తినటువంటి సంక్షోభం మార్క్స్ రాజకీయ జీవితం లోనూ, వ్యక్తిగత జీవితంలోనూ కూడా అనేక మలుపులు తిప్పాయి.

అదెలా జరిగిందంటే, ప్రష్యా అనేది జర్మనీ లో ఒక భాగం అనుకున్నాం కదా! ఆ ప్రష్యా దేశానికీ, ఫ్రాన్సుకి చాన్నాళ్ళుగా స్పర్ధలు వున్నాయి. అవి పెరిగి పెరిగి తారాస్థాయికి వచ్చి,187o జూలై 19 న ఫ్రాన్సు, ప్రష్యా మీద యుద్ధం ప్రకటించింది. ఆ యుద్ధంలో మొట్ట మొదటి నుండి ప్రష్యాదే పైచేయి అయింది. ఈ యుద్ధం మొదలైన కొద్ది రోజుల్లోనే ఫ్రాన్స్ అధ్యక్షుడు “నెపోలియన్ “లొంగిపోయాడు. ఫ్రాన్సుని ఆక్రమించునటువంటి ప్రష్యా సైన్యానికి,పారిస్ నగరం లోనికి రావడానికి అవరోధం ఎదురైంది. ఎందుకంటే, పారిస్ నగరంలో స్థానికంగా “నేషనల్ గార్డ్స్” వాళ్ళని అడ్డుకున్నారు. నిజానికి వాళ్ళు సైన్యం కాదు. స్థానికంగా వున్న పోలీసుల్లాంటి వారు.వాళ్ళు ప్రష్యా సైన్యంతో సాయుధపోరాటం చేశారు. పారిస్ లోనికి ప్రష్యా సైన్యం ప్రవేశించకుండా అడ్డుకున్నారు.వేలాది మంది చనిపోవడం, అరెస్టులు కావడం జరిగింది. మళ్ళీ ఫ్రాన్సులో కొత్త ప్రభుత్వం ఏర్పడడం జరిగింది. ఇవన్నీ కూడా 187o చివరిలో జరిగిన సంఘటనలు.దీనికి కొనసాగింపుగా 1871 మొదట్లో పారిస్ లో సివిల్ వార్ మొదలయ్యింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ, స్థానికంగా ఉన్న విప్లవ సంఘాలన్నీ కలసి, ఫ్రాన్సు ప్రభుత్వానికి ఎదురు తిరగడంతో, సివిల్ వార్ మొదలయ్యింది. అది 1871మర్చి నుండి1871 మే వరకు అంటే 2 నెలల పైగా జరిగింది. దీన్నే చరిత్రలో “ పారిస్ కమ్యూన్ " అంటారు.

ఇదంతా ఫ్రాన్సులోని, పారిస్ కేంద్రంగా జరిగినటువంటి సంక్షోభం. దీనికి లండన్ లో వున్న మార్క్సుకి ఏమీ సంబంధం లేదు. ఈ సంక్షోభసమయంలో కుటుంబపరంగా జరిగిన పరిణామాల్ని చూద్దాం. వీటిని రెండు కోణాల నుండి చూడవచ్చు.ఒకటి, మార్క్సు, ఎంగెల్సులు ఈ సంక్షోభం గురించి రాసినటువంటి వ్యాసాలూ, వాటి వలన జరిగినటువంటి పరిణామాలు. రెండు మార్క్సు కూతురూ, అల్లుడూ అక్కడ పారిస్ లో వున్నారు కదా! వాళ్ళ జీవితంలో కలిగినటు వంటి మార్పులు. ముందు మార్క్సు, ఎంగెల్సుల సంగతి---'ప్రష్యా, ఫ్రాన్సుల మధ్య యుద్ధం మొదలయిన దగ్గర నుండి అది ఎటు వైపు వెళుతున్నది. ఎటు వైపు వెళితే కార్మికులకు మంచి జరుగుతుంది. ప్రభుత్వాలూ, ప్రభుత్వాలూ చేసుకుంటున్న యుద్ధంలోకార్మికులు యెంత తటస్థ వైఖరిని అవలంబించాలి.' అనే అంశాల మీద మార్క్సు, ఎంగెల్సులు పత్రికల్లో రాసినటువంటి వ్యాసాలు చాలామందిని ఆకర్షించాయి. ఇదంతా ఒక వైపు యుద్ధం జరుతుండగానే.

అంతే కాకుండా మార్క్సు నాయకత్వం వహిస్తున్న i.w.m.a.సంస్థ అందులోని పారిస్ లోని సభ్యులు 'పారిస్ కమ్యూన్' లో భాగస్వాములయ్యారు. అంచేత ఈ i.w.m.a. సభ్యుల కోసం వేట మొదలయ్యింది. ఇదంతా పారిస్ లో. అందులోని సభ్యులు కొంతమంది లండన్ వచ్చారు. సహజంగానే వాళ్ళందరికీ లండన్ లో మార్క్సు ఆశ్రయం ఇచ్చాడు. అక్కడకు దగ్గరలోనే ఎంగెల్సు వున్నాడు కదా! వాళ్ళ రెండు ఇళ్ళూ కూడా పారిస్ నుండి వచ్చిన కాందిశీకుల పునరావాస కేంద్రాలుగా మారిపోయాయి. అక్కడితో అయిపోయిందా ? తాత్కాలికంగా ముందు ఆశ్రయం ఇవ్వాలి. తరువాత తిండి. ఆ తర్వాత వాళ్ళు చేసుకోవడానికి పని చూపించాలి. వీటన్నిటికోసం విరాళాలు సేకరించాలి.ఈ పనుల్లో మార్క్సు, ఎంగెల్సు లు తీరిక లేకుండా వుండేవాళ్ళు.

ఆ రోజుల్లోనే మార్క్సు ఒక చిన్న పుస్తకం రాశాడు. అది చాలా చిన్న పుస్తకం 35,4o పేజీలు మాత్రమే వుంటుంది. అ పుస్తకం పేరు "ది సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్ "ఆ చిన్న పుస్తకం పెద్ద సంచలనం కలిగించింది.' ఇనిస్టెంట్ హిట్ 'అన్నట్లుగా ఆ 35 పేజీల పుస్తకం వేలాది కాపీలు అమ్ముడు పోవడమే కాకుండా, అంతర్జాతీయ ప్రెస్ ని ఆకర్షించింది. అంత వరకూ 'కార్ల్ మార్క్సు' అంటే, ఆ చుట్టుపక్కల వారికి మాత్రమే తెలుసు. ఇప్పుడు మార్క్సు పేరు యూరప్ అంతటా మాత్రమే కాకుండా అమెరికా అంతటా మారు మ్రోగిపోయింది. ఇలా పేరు రావడమే కాకుండా...

"అసలు మార్క్సు, ఫ్రాన్సు లో 'పారిస్ కమ్యూన్' ప్రణాళికలు వేశాడు. i.w.m.a. సభ్యుల్ని అతనే రెచ్చగొట్టి, పారిస్ కమ్యూన్ లో చేర్పించాడు. ఈ రెండు తిరుగుబాట్లకీ మార్క్సే కారణం " అనే కథనాలు కూడా ప్రారంభం అయ్యాయి. దాంతోటి ఆయనకు బెదిరింపు ఉత్తరాలు రావడం ప్రారంభమయ్యాయి. అంతేకాదు " అసలు మార్క్సు, లండన్ వదలి వెళ్లిపోయాడనీ, కార్ల్ మార్క్సు చనిపోయాడనీ, ఎవరో చంపేశార"నీ ఇలాంటి పుకార్లు చాలా వచ్చాయి. ఈ పుకార్లు యెంత దూరం వెళ్ళాయంటే..అమెరికాలోని ప్రసిద్ద పత్రికలన్నీకూడా కార్ల్ మార్క్సు గురించే ప్రధాన వార్తలు రాసేటంతగా వెళ్ళాయి. మొత్తం మీద ఫ్రాన్సు, ప్రష్యాల యుద్ధం, పారిస్ కమ్యూన్ సంఘటనా వీటన్నితోటీ మార్క్సు

వార్తల్లోని వ్యక్తి అయ్యాడు. ఇదిలా వుంటే, ఆయన రాసిన 'కేపిటల్ ' పుస్తకం అక్కడ జర్మనీలో అమ్మకాలు పుంజుకుంటోంది. ఇక రెండో కోణం. ఇలాంటి యుద్ధ సమయంలో పారిస్ లో మార్క్స్ రెండో అమ్మాయి లారా, పాల్ లు ఎలా వున్నారో చూద్దాం.

ఇప్పటికి అంటే 187o మధ్య కాలానికి మార్క్స్ అమ్మాయి లారాకి పెళ్ళయి 2 సంవత్సరాలు అయింది. ఈ పాల్ యెంత చెప్పినా వినకుండా క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నాడని మార్క్స్‌కు తెలుసు. అందుకని పారిస్ లో ఎప్పుడైతే యుద్ధ వాతావరణం మొదలయ్యిందో, అప్పుడే "మీరు పారిస్ వదలి మీ నాన్న దగ్గరకు వెళ్ళిపొండి"అని వుత్తరం రాశాడు అల్లుడుకి. పాల్ ఏం చేశాడంటే, భార్యనీ, ఏడాదిన్నర వయసున్న బాబునీ తీసుకొని వాళ్ళ తలిదండ్రులు న్నటువంటి "బోర్డెక్స్" అనే చిన్న పట్టణం వెళ్లి పోయాడు. ఆ వూరు పారిస్ చాలా దూరం లో వుంటుంది. ఇక లారా అప్పటికే పసి బిడ్డ చనిపోయింది. ఏడాదిన్నర వయసున్న పసి బిడ్డను చూసుకుంటూ దిగులును మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నది.

అయితే, పారిస్ లోనూ, పారిస్ చుట్టుపక్కల యుద్ధ ప్రభావం ఎక్కువగా వుంది గానీ, ఈ 'బోర్డెక్స్' అనే ఈ పట్టణానికి ఆ వాతావరణం రాలేదు. లారా, పాల్ లు అక్కడకు వెళ్లేసరికి పాల్ నాన్నకు అనారోగ్యం చాలా తీవ్రంగా వుంది. ఆయన మంచం మీద పడుకొని వున్నాడు. అప్పుడు కూడా 'తను చెప్పినట్టు మెడిసన్ పూర్తి చెయ్యలేదని' దెప్పిపొడుస్తుండేవాడు. అలా మంచం మీద వున్న పాల్ నాన్న 187o నవంబర్ 18న చనిపోయాడు. ఆయన చనిపోయాక లారాకి అత్తగారి వేధింపులు ఎక్కువయ్యాయి.

"మీ మూలానే ఆయన చనిపోయాడు.మీ నాన్న వల్లనే మా అబ్బాయి రాజకీయాల్లో తిరుగుతున్నాడు "అని ఎప్పుడూ లారాని తిడుతుండేది అత్తగారు. ఇలా వుండగా లారా 3 సారి గర్భవతి అని తెలిసింది. అదేమో చలికాలం. లారా గర్భవతి అని తెలిసినా, 2 ఏళ్ళ బాబు అని కూడా చూడకుండా, 'ఫైర్ ప్లేస్ ' వున్న గదిలో వుండ నిచ్చేది కాదు. పాల్ ఎప్పుడూ రాజకీయాల్లో తిరుగుతుండేవాడు. లారా బ్రతుకు రోజురోజుకీ దుర్భరం అయిపోతోంది. అయినా ఈ విషయాలేవీ బాధ పడతారని, అమ్మ నాన్నలకు తెలియజేసేది కాదు. 'ఎలాగూ అంత దూరం నుండి చేసేదేమీ లేదు. చెప్పి ప్రయోజనం లేదు.' అనుకుంది. ఒకరోజు అత్తగారు ఇంట్లో వున్న సామాన్లన్నీ సర్దుకొని వేరే ఇంటికి వెళ్ళిపోయింది. ఈ ఖాళీ అయిన ఇంట్లో లారా ఒక్కతే బిక్కుబిక్కుమంటూ ఉండిపోయింది.

తర్వాత పాల్ వచ్చి, విషయం తెలుసుకొని, యేవో అత్యవసరమైన సామాన్లు తెచ్చాడు. యుద్ధ వాతావరణం పారిస్ నుండి మిగతా ప్రాంతాలకు కూడా వ్యాపించసాగింది. అన్ని ప్రాంతాలతో పాటు ఈ 'బోర్డెక్స్' పట్టణానికి కూడా ఆ సెగ తగలడం మొదలయ్యింది. అప్పటికి నెలలు నిండుతున్నాయి లారాకి. " ఇంట్లో ఎవరూ లేరు. నువ్వయినా కాస్త కనిపెట్టుకొని వుండు" అని మార్క్స్ పదేపదే సందేశాలు పంపిస్తున్నాడు పాల్ కి. కానీ, పాల్ మాత్రం తన రాజకీయ కార్యకలాపాలు తగ్గించుకోలేదు.

ఆ సమయంలో అంటే, ఒక పక్క పారిస్ లో సివిల్ వార్ తీవ్రస్థాయిలో జరుగుతున్నా సమయంలో 1871 మార్చిలో లారా మరొక మగ బిడ్డకు జన్మ నిచ్చింది. ఇంట్లో భార్యా, భర్తా ఇద్దరే వుండేవారు.ఈ విషయం మార్క్స్, జెన్నిలకు తెలిసింది. లారా పరిస్థితి గురించి చాలా ఆందోళన పడసాగారు. ఒక పక్క సివిల్ వార్ జరుగుతోంది. ఆ కుర్రవాడు బయట తిరుగుతాడు. మరోపక్క చిన్న పిల్లవాడు. జెన్నీ కూతురు దగ్గరకు వెళ్దామంటే ఆమెకు పాస్ పోర్ట్ సమస్య. పైగా బయట దుర్భరమైన వాతావరణం. అలాంటి సమయంలో 27 వయసు వున్న పెద్దమ్మాయి చెన్, 16 వయసు వున్నచిన్నమ్మాయి 'ఎలినార్ ' "మేం వెళతాం లారా కి సహాయంగా " అన్నారు. అప్పట్లో ఫ్రాన్సు కి వెళ్ళడం అంటే, చాలా సాహసంతో కూడుకున్న వ్యవహారం. యుద్ధ వాతావరణం కదా! పైగా వీళ్ళకి పాస్ పోర్ట్ లు రావు. వేరే పేర్లతో వెళ్ళాలి. అలాగే మారు పేర్లతో పాస్ పోర్ట్ లు సంపాదించుకున్నారు.

ఇక వెళదాం అనుకున్న సమయానికి "పారిస్ వెళ్ళే ఓడలన్నీ సరుకులతో నిండిపోయాయి. ప్రయాణికుల్ని ఎక్కించుకోవడం కుదరదు "అని చెప్పారు. అయినా కూడా వెనకాడకుండా సాధారణమైన బోటు లోనే ప్రయాణానికి సిద్ధమయ్యారు ఇద్దరూ. ఇక్కడ నుండి మొదలై మరో 7నెలల వరకూ, అంటే లండన్ చేరుకునే వరకూ జరిగినటు వంటి సంఘటనలూ. చేసినటువంటి సాహసాలూ, ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులూ ఇవన్నీ కూడా మూడు గంటల సేపు సాగే సస్పెన్స్ సినిమాకు ఏమీ తీసిపోవు. అడుగడుగునా ఆడపిల్లలిద్దరూ చూపిన ధైర్యం, సాహసం తండ్రి మార్క్స్ నుండి పుణికి పుచ్చుకున్నారనిపిస్తోంది.

లండన్, పారిస్ ల మధ్య ఉన్నటువంటి "ఇంగ్లీష్ చానల్ " దాటడానికి, విపరీతమైన ఈదురుగాలుల మధ్య, అత్యంత ప్రమాదకరమైన ప్రయాణాన్ని చేశారు ఆడపిల్లలిద్దరూ కూడా. 4రోజుల తర్వాత పారిస్ లో దిగారు. పారిస్ అంతా యుద్ధ వాతావరణంతో గందరగోళంగా వుంది. పాస్ పోర్ట్ లు తనిఖీ చేసేవారు కూడా ఎక్కువగా కనిపించలేదు. ఎలాగో సైనికుల్నీ, బులెట్లనీ తప్పించుకొని సందు గొందుల్లో నుండి ఎలాగో పారిస్ ఊర్లోకి చేరుకొని, అక్కడ నుండి మళ్ళీ ఒకటి, రెండు రోజులు ప్రయాణం చేసి,1871 ఏప్రెల్ 24న "బోర్డెక్స్" చేరుకున్నారు. ఒక్కసారిగా చెన్ నీ, ఎలినార్ నీ చూసేసరికి చాలా ధైర్యం వచ్చింది లారాకి. ఆ పసిబిడ్డ ఆరోగ్యం ఏమంత బాగుండలేదు. అక్కా చెల్లెలూ తోడుగా వున్నారు కాబట్టి లారా పూర్తిగా ఆ పసి బిడ్డను చూసుకుంటోంది. రెండేళ్ళ బాబునీ, ఇంట్లో పనుల్నీ చెన్, ఎలినార్ లు చూసుకుండేవారు. ఆ పాల్ ఎప్పుడు వచ్చేవాడో, ఎప్పుడు వెళ్లేవాడో ఎవరికీ తెలిసేది కాదు.

సివిల్ వార్ 2నెలల్లో ముగిసింది. ఫ్రాన్సు ప్రభుత్వం i.w.m.a.సభ్యుల మీద ఉక్కు పాదాన్ని మోపుతూ అరెస్టులు చెయ్యడం మొదలుపెట్టింది. అప్పటికే 'బోర్డెక్స్' వున్నా పాల్ ఇంటికి రెండు మూడు సార్లు వచ్చి వెళ్లారు. ఎప్పుడైనా సరే తనని అరెస్ట్ చేస్తారని తెలుసుకున్న పాల్, భార్యా, పిల్లలూ, మరదళ్ళనీ తీసుకొని ఫ్రాన్సు కి పొరుగు దేశమైన "స్పెయిన్" సరిహద్దుల్లో వున్న "లంచాన్" అనే ఊరుకి వెళ్ళాడు. అదొక చిన్న పల్లెటూరు. అక్కడైతే ఎవరూ గుర్తుపట్టారనుకున్నాడు.

అది ఫ్రాన్సు లోనే వుంది. కాకపోతే కొంచెం దూరం వెళితే 'స్పెయిన్' వస్తుంది.అక్కడ వాళ్ళు రహస్యంగా .ఇరుగుపొరుగు వాళ్ళని ఎవరినీ లోనికి రానిచ్చే వారుకాదు. ఇంటి ఓనర్స్ కి కూడా వీళ్ళ సమాచారం పూర్తిగా చెప్పలేదు. వీళ్ళ కబుర్లన్నీ కూడా i.w.m.a. ద్వారా మార్క్స్ కు తెలుస్తుండేవి.

మార్క్స్ కూడా పాల్ అలాగే రహస్య సందేశాలు పంపిస్తుండేవాడు. ఒకసారి ఇలా సందేశం పంపించాడు "నీకోసం ఫ్రాన్సు ప్రభుత్వం వెతుకుతోంది.ఏ క్షణంలో నైనా నిన్ను దేశ బహిష్కారం చేయవచ్చు.ముందే వెళ్ళిపోవడం మంచిది."అని. అయితే, ముగ్గురు అక్కా చెల్లెళ్ళూ ఒప్పుకోలేదు. అప్పటికే పసి బిడ్డ చాలా అనారోగ్యంతో వుంది. అలా వాళ్ళు ఏ క్షణాన ఏం జరుగుతుందో ఉద్విగ్నతతో వుండగా 1871 జూలై 26న ఆ 4నెలల పసిబిడ్డ చనిపోయాడు. అంటే ఏడాదిన్నరలో రెండో పసి మరణం. ఏదో తాత్కాలికంగా వుందాము అనుకోని వచ్చినటు వంటి వూరు 'లంచాన్ 'లోనే ఆ బిడ్డను ఖననం చేశారు. ఇంకా దురద్రుష్టం ఏమిటంటే, ఆ బిడ్డను ఖననం చేయగానే, ఇంట్లో వున్న రెండున్నర ఏళ్ళ బాబుకి కూడా దగ్గూ, జ్వరమూ మొదలయ్యాయి.

ఏ ఫ్రాన్సు ప్రభుత్వం వెంటాడుతుందని భయపడ్డారో, ఆ రోజు రానే వచ్చింది.1871 ఆగస్ట్ 4న పోలీసులు ఇంటి తలుపులు తట్టారు.

ఈ " బోర్డెక్స్ 'కీ, పారిస్ కమ్యూన్ కీ మధ్య సమాచారం నువ్వే చేరవేస్తున్నావని నిర్ధారణ అయింది.నువ్వు దేశ సరిహద్దులు దాటడానికి గంట సమయం ఇస్తున్నాం " అని పాల్ కి తాకీదు జారీ చేశారు.ఇంట్లో ముగ్గురు ఆడవాళ్ళనీ, అనారోగ్యంతో వున్న బాబునీ అలాగే వదిలేసి, మరి ఒక్క గంటలో వెళ్ళిపోవాలి కదా! ఆఘమేఘాల మీద అక్కడ నుండి బయలుదేరి ;స్పెయిన్ 'దగ్గర్లో వున్న ఒక చిన్న గ్రామానికి ఒక మిత్రుడి సహాయంతో వెళ్ళాడు పాల్. ఈ ఆడపిల్లలూ, చిన్న బాబూ 'లాంచన్' లోనే వుండిపోయారు. తను ఎక్కడున్నదీ, ఏమిటీ అన్న సమాచారాన్ని రహస్యంగా అందిస్తుండేవాడు పాల్. ఇక అప్పుడు చెన్ ధైర్యం చేసి,

"మనం ఇక్కడ ఒక్కళ్ళమే వుండడం అంత మంచిదికాదు.బాబుకి కూడా ఆరోగ్యం బాగుండడం లేదు. నిన్ను పాల్ దగ్గరకు చేరుస్తాం" అని అక్కాచెల్లెళ్లు ఇద్దరూ లారాని,బాబునీ వెంటబెట్టుకొని, అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఫ్రాన్సు సరిహద్దు దాటి, స్పెయిన్ లో వున్నా పాల్ ఉన్న గ్రామం చేరుకున్నారు. 'ఈ పథకాన్ని అంతటినీ కూడా పగడ్బందీగా అమలు పరచడంలో చిన్నమ్మాయి 'ఎలినార్ 'చాలా చాక చక్యంగా వ్యవహరించిందని' చరిత్ర చెబుతోంది. ఆ గ్రామం చేరుకున్నాక అక్కా చెల్లెళ్ళు ఏం చేశారంటే, లారానీ, బాబు నీ పాల్ కి అప్పగించేసి "మేం ఎలాగో పారిస్ వెళ్లి, అక్కడ నుండి లండన్ వెళ్ళిపోతాం" అని పాల్ తో చెప్పి వెనక్కి బయలుదేరారు. ఈ తిరుగు ప్రయాణంలో అంటే, స్పెయిన్ నుండి ఫ్రాన్సు సరిహద్దును దాటడానికి ఆడపిల్లలిద్దరికీ చాలా కష్టమయింది. సరిహద్దు పోలీసులు ఆపి, తనిఖీలు చెయ్యడం మొదలుపెట్టారు.అప్పటికే మార్క్స్ పేరు యూరప్ అంతటా మారుమ్రోగిపోతోంది. "ఈ ఫ్రాన్సు సివిల్ వార్ లో

కూడా మార్క్స్ అనుచరులు వున్నారని" పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఈ ఆడపిల్లలిద్దరూ మార్క్స్ సంతానం అని తెలిస్తే, చాలా ప్రమాదం. మార్క్స్ రాసిన వుత్తరం చిన్నమ్మాయి 'ఎలినార్ ' దగ్గర వుంది.అది గనుక పోలీసుల కంట పడితే చాలా ప్రమాదం అని పోలీసులు చూడకుండా నమిలి మింగేసింది ఎలినార్.

అయినా గానీ, వీళ్ళిద్దరూ ఏదో గూడచారి వర్గానికి చెందిన వాళ్ళని అనుమానించారు. ఆ కాపలా పోలీసులు వీళ్ళను 2,3, రోజుల పాటు ఆ సరిహద్దులో వున్నటు వంటి పోలీస్ స్టేషన్ లో వుంచి, రకరకాల ప్రశ్నలు వేశారు. నఖ శిఖ పర్యంతం సోదాలు చేశారు. వాళ్ళిద్దరూ కూడా మార్క్స్ పిల్లలు కదా! ధైర్య సాహసాలకి మారుపేరుగా వుండేవారు. ఏ కోణంలో కూడా పోలీసులకి దొరక్కుండా బయటపడ్డారు. ఈ సంఘటనలన్నిటినీ కూడా 12 సంవత్సరాల తర్వాత చెన్ చనిపోయినప్పుడు ఎంగెల్సు వచ్చిన వాళ్లకు వివరంగా చెప్పాడు.

ఆ విధంగా అక్కచెల్లెళ్ళు పారిస్ చేరుకొని, అక్కడ నుండి లండన్ చేరుకున్నారు. ఇదంతా జరిగేసరికి 1871 సెప్టెంబర్ వచ్చింది. ఈ లారా, పాల్ లు అక్కడే స్పెయిన్ లో ఆ చిన్న గ్రామం 'మెండ్రిక్' లోనే వున్నారు. బాబు ఇంకా అనారోగ్యంతోనే వున్నాడు. అదలా వుంచి లండన్ లో ఏం జరిగిందో తెలుసుకుందాం.

ఆడపిల్లలిద్దరూ లండన్ లో లేని 5,6మాసాల సమయంలో చాలా విశేషాలు జరిగాయి. ముఖ్యంగా మార్క్స్ వచ్చినటువంటి పేరు. అతన్ని ఇంటర్వ్యూ చెయ్యడానికని విదేశీ పత్రికా ప్రతినిధులు చాలా మంది వస్తుండేవారు. వాళ్ళందరికీ కూడా వరసగా అపాయమెంట్లు ఇవ్వడం, భార్య జెన్ని చూస్తుండేది. ఎంగెల్సు దగ్గరలోనే వున్నాడు కాబట్టి, డబ్బులకి ఇబ్బంది లేదు. అందుకని మార్క్స్ ,జెన్నిల ఈతి బాధలు ఫుల్ స్టాప్ అయ్యాయని అనుకోవచ్చు. ఇంకా మార్క్స్ తన పూర్తి సమయాన్ని 'కేపిటల్-2' గురించి పరిశోధన చెయ్యడానికీ, అలాగే పారిస్ నుండి పారిపోయి వచ్చిన వాళ్ళ సంక్షేమం కోసం చేస్తున్న ప్రయత్నాలూ, అప్పట్లో ఉన్నటువంటి రాజకీయాలమీద వ్యాసాలు రాయడం వీటన్నిటి తోటి తీరికలేకుండా వున్నాడు.

మార్క్స్, జెన్నిలూ, ఎంగెల్సూ,అతని భార్య లిజీ మొత్తం నలుగురూ కలసి తరచూ బయటకు వెళుతుండేవారు షికార్ల లాగ. ఇప్పటి వరకూ అంటే, ఈ సంఘటనలు జరుగుతున్నంత వరకూ మార్క్స్, జెన్నిల మధ్య భార్యాభర్తల బంధం చాలా యాంత్రికంగా వుండేది. ఇదిగో మళ్ళీ చాలా ఏళ్ళ తరవాత, డబ్బుల గురించిన బాధలు తగ్గాక, మార్క్స్ కు పేరు రావడం మొదలయ్యాక, ఇద్దరి మధ్యా అనుబంధం బలపడింది. ఆడపిల్లలిద్దరూ లండన్ చేరుకున్నారు. వాళ్ళు సమయానికి మార్క్స్, ఎంగెల్సులు i.w.m.a. సంస్థ యొక్క కాన్ఫరెన్సు కోసమని ఏర్పాట్లు చేస్తున్నారు లండన్ లోనే. అప్పుడే, తండ్రికి సహాయం చేయడం కోసమే వచ్చారా? అన్నట్లుగా వచ్చారు అక్కచెల్లెళ్ళు. ఆ కార్యక్రమాలలో చాలా వరకు భాధ్యతలు తీసుకున్నారు ఆడపిల్లలిద్దరూ. అప్పటికే చెన్ క్రియాశీలక కార్యకర్తగా పేరు తెచ్చుకుంది.1871అక్టోబర్ ప్రాంతాలలో 5 రోజులు జరిగినటువంటి ఆ కాన్ఫరెన్సులో కూడా చాలా చురుకైన పాత్ర పోషించింది చెన్.

ఆ కాన్ఫరెన్సు కి యూరప్ నుండీ మిగతా దేశాల నుండి కూడా చాలామంది కార్మికులు వచ్చారు. ఈ కాన్ఫరెన్సు అయేసరికి మార్క్సు మరోసారి నియంత్రుత్వ నాయకుడు అనుకున్నారు. మార్క్సు యెంత అధికారం చూపిస్తున్నప్పటికీ, వ్యతిరేకించేవాళ్ళు కూడా చాలామంది వుండేవాళ్ళు "మన మాట వినిపించుకోడు.ఆయన చెప్పిన మాటే మనమీద రుద్దుతాడు "అనుకున్నారు. ఎలాగైతేనేం ఆ కాన్ఫరెన్సు విజయవంతంగా పూర్తయ్యింది. ఈ కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లోనే మార్క్సు రాసినటువంటి "సివిల్ వార్ ఇన్ ఫ్రాన్సు" అనే చిన్న పుస్తకాన్ని ఎంగెల్సు జర్మనీ భాషలోకి అనువాదం చేసి, జర్మనీకి పంపించాడు.

జర్మన్ భాషలో పబ్లిష్ అయిన, ఈ చిన్న పుస్తకం మీద అనువాదం 'ఎంగెల్సు' అని రాసి వుంది. ఆ కాపీ ఒకటి ఎంగెల్సు అమ్మగారి చేతికి వెళ్ళింది. ఆమెకి అప్పటికి 74 సంవత్సరాలు. ఎంగెల్సు అప్పటికి తల్లిని చూసి చాలా కాలం అయింది.ఆ పుస్తకం చూసిన ఆమె కొడుకు ఎంగెల్సు కి ఒక ఉత్తరం రాసింది.

"ఏం రా అబ్బాయ్! నువ్వు ఇప్పటికీ మారలేదన్న మాట. ఇంకా ఆ కార్ల్ మార్క్సు స్నేహాన్ని వదల్లేదన్నమాట. అతనితోనే తిరుగుతున్నావు. మీ నాన్న యెంత చెప్పినా వినలేదు. నువ్వు ఇప్పటికీ మార్క్సుని వదల్లేదనీ తెలిసింది.మరి ఇంకేం మారతావులే."అని రాసింది. దానికి ఎంగెల్సు ఏం రాసాడంటే...

"అమ్మా! నా సంగతీ, నా భావాలూ చాలా సార్లు చెప్పాను. మార్క్సు లాంటి మిత్రుడు తారసపడక పోయినప్పటికి కూడా, నేను ఇలాగే వుంటాను. నా భావాల్లో ఎప్పుడూ మార్పు వచ్చేది కాదు.అనవసరం గా అతన్ని ఆడిపోసుకోవద్దు."అని రాశాడు.

అదే రోజుల్లో మార్క్సు యొక్క చెల్లెలు దక్షిణ ఆఫ్రికాలో వుంది. ఆమె వేరే ఏదో పనిమీద లండన్ వచ్చి, ఈ అన్నయ్య ఉన్నటువంటి జీవితం, ఆయన చేస్తున్న పనులూ అన్నీచూసి చాలా నిరసన ప్రకటించింది. ఆమె అంది "నాన్న, లాయరుగా ఎంతో పేరు తెచ్చుకున్నాడు. నువ్వు కూడా ఏదో వుద్యోగం చేసుకుంటే యెంత బాగుండేది. ఎందుకీ బాధలన్నీ."అంది. అన్నిటికీ మార్క్సు నుండి ఒక్కటే సమాధానం. బిగ్గరగా నవ్వడం మాత్రమే. అప్పుడే జరిగిన మరొక సంఘటన ఏమిటంటే...జెన్ని చెన్ ఒక స్కాటిష్ కుటుంబంలో వుద్యోగం చేస్తున్నది అనుకున్నాం కదా! ఆమె, మార్క్సు కమ్యునిస్ట్ నాయకుడనీ, జెన్ని చెన్ అతని కూతురని వుద్యోగం లోనుండి తీసేసింది. దానికి జెన్ని చెన్ ఏమీ బాధ పడలేదు. ఎందుకంటే, ఆమె అప్పటికే రాజకీయ కార్య కాలాపాల్లో వుంది. 'పూర్తి కాలం వ్యాసాలు రాసుకోవచ్చు.'అనుకుంది. ఈ చిన్నమ్మాయి ఎలినార్ కూడా తండ్రికి సహాయకురాలైంది. తండ్రి యొక్క వ్యాసాలు ఫెయిర్ చెయ్యడం, అలాగే విదేశాలనుండి వచ్చే ఉత్తరాలకి ప్రత్యుత్తరాలు ఇవ్వడం ఇలాంటి పనులు చేస్తుండేది.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 నవంబర్ 26 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS

కౌముది